

# హెచ్‌ఎంఆర్‌కు..

# అరుదైన గౌరవం

**హార్వర్డ్ కేసు స్టడీగా హైదరాబాద్ మెట్రో**

**హార్వర్డ్ బిజినెస్ జర్నల్‌లో ప్రత్యేక ప్రస్తావన**

**ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కృషిని కొనియాడిన హార్వర్డ్**

**హార్వర్డ్ యూనివర్సిటీ దృష్టితో ప్రపంచస్థాయి గుర్తింపు**

హైదరాబాద్, (ఆంధ్రప్రభ) : మొన్న ఐఎస్‌బీ, నిన్న స్టాన్‌ఫర్డ్, నేడు హార్వర్డ్... అంతర్జాతీయంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన యాజమాన్య శాస్త్ర విద్యాలయాలు హైదరాబాద్ మెట్రో రైల్ విజయ గాథను తమ విద్యార్థుల అధ్యయనానికి పరిశోధనా అంశాలుగా ప్రచురించాయి. హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సారథ్యంలో మెట్రో రైల్ వ్యవస్థ ఒక ప్రముఖ రవాణా వ్యవస్థగానే కాకుండా మౌలిక వసతుల కల్పనలో ఒక నూతన ఒరవడిని సృష్టించి, పీపీపీ విధానంలో ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ప్రాజెక్టుగా అవతరించిందని హార్వర్డ్ తాజాగా వెల్లడించిన పరిశోధనా పత్రంలో స్పష్టం చేసింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రపంచంలోని అగ్రశ్రేణి వ్యాపార, యాజమాన్య శాస్త్రవిద్యాసంస్థలలో ఒకటి. ఇది ప్రచురించే హార్వర్డ్ బిజినెస్ రివ్యూ వ్యాపారనిర్వహణ, యాజమాన్యశాస్త్ర, సాంకేతికాంశాలు, నాయకత్వ అభివృద్ధి, వ్యాపార వ్యూహాత్మకతపై ప్రపంచ స్థాయిలో అత్యున్నతమైన కంటెంట్, కేస్ స్టడీలు, పరిశోధనాత్మక వ్యాసాలు అందిస్తుంది. ప్రముఖ సంస్థలు, నాయకులు, యాజమాన్య శాస్త్ర పండితులు, విద్యార్థులు హార్వర్డ్ శిక్షణను అనుసరిస్తారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్ వంటి ప్రపంచంలోని ప్రముఖ వ్యాపార రంగ దిగ్గజాలు హార్వర్డ్ ఎడ్యుకేషన్‌ను తమ నాయకత్వ అభివృద్ధికి ఉపయోగించుకుంటాయి. వ్యాపార వ్యూహాలు, మేనేజ్‌మెంట్ సూత్రాలు - వ్యాపార నిర్వహణలో విశ్లేషణాత్మకతర్కం, నేతృత్వనైపుణ్యం, ఆర్థిక విధానాల నిర్వహణ వంటి విషయాలలో వ్యాపార దిగ్గజ సంస్థలకు హార్వర్డ్ మార్గదర్శకంగా ఉంటుంది. అలాంటి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ విశ్వవిద్యాలయం మన మెట్రో రైలు విజయగాథను పరిశోధనాత్మకంగా తీసుకోవడం విశేషం.

## ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి కృషి అమోఘం..



హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు విజయవంతం కావడంలో సంస్థ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి చేసిన విశేష కృషి ఎంతో ఉందని అనడంలో ఏలాంటి సందేహం లేదు. ప్రధానంగా ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అనేక సవాళ్ళ ను అధిగమిస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు తీసుకెళ్లడం లో ఎన్వీఎస్ రెడ్డి నైపుణ్యశైలిని, నాయకత్వ లక్షణాలను హార్వర్డ్ యూనివర్శిటీ పరిశోధనా పత్రంలో ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రతిష్టాత్మకమైన ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) ప్రొఫెసర్లు, పరిశోధకులు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు స్థాపనకు అంకురించిన ఆలోచనలు, దానిని అమలు చేసిన తీరుపై 'హైదరాబాద్ మెట్రో - ఆలోచన నుంచి అమలువరకు పబ్లిక్ ప్రైవేట్ ప్సార్టనర్‌షిప్ (పీపీపీ విధానం) లో ప్రపంచంలోని అతిపెద్ద మెట్రో రైల్ ప్రాజెక్ట్" అనే ఇతివృత్తంతో చేసిన పరిశోధనా పత్రాన్ని హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఒక కేస్ స్టడీగా ఎన్నుకొని తమ ప్రతిష్టాత్మక హార్వర్డ్ బిజినెస్ జర్నల్‌లో ప్రచురించింది. 2006లో ఎన్వీఎస్ రెడ్డి నగర రవాణా సమస్యలను పరిష్కరించేందుకు మెట్రో ప్రాజెక్టు ఆలోచన చేసారని, పీపీపీ (ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య) మోడల్ ద్వారా ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్దపీపీపీ మెట్రో ప్రాజెక్టుగానిలిచిందని ఈ పత్రంస్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి మొదట మేటాస్ పతనం, భూసేకరణ సమస్యలు, అనేక రకాల ఆందోళనలు, రాజకీయ ఒడిదుడుకులు వంటి అనేక అడ్డంకులను అధిగమించి, అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో కూడిన మెగా ప్రాజెక్టుగా అవతరించిందని పేర్కొంది. హైదరాబాద్‌కి మెట్రో రైల్ అవశ్యకతను, ఆ అవసరాన్ని ఆచారణాత్మకంగా ఆయన ఏ విధంగా అమలు చేశారో వివరించింది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజా రవాణా వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పును తీసుకువచ్చారని చెబుతూ పలు అంశాలను పత్రంలో హార్వర్డ్ యూనివర్శిటీ ప్రముఖంగా ప్రస్తావించింది. భూసేకరణ సమస్యలు, వివిధ ప్రభుత్వ శాఖల ఆమోదాలు, రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక సవాళ్లు వంటి అనేకసమస్యలను సమర్థ నాయకత్వంతో ఆయన అధిగమించారు. సమర్థమైన ప్రణాళికలు, సున్నితమైన చర్చల ద్వారా హైదరాబాద్ మెట్రోను ప్రపంచస్థాయి అభివృద్ధికి తీసుకువచ్చారు. ప్రతిభాపూర్వకమైన, ధైర్యమైన నిర్ణయాలు, పాలనలో చైతన్యం ద్వారా భారతదేశపు అత్యుత్తమ మెట్రో వ్యవస్థగా హైదరాబాద్ మెట్రో నిలిచింది.